# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ పండుగలను జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.**
2. **తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **రేషన్ సరకులు నెల మొత్తం పంపిణీ చేసేలా చూస్తామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాల్లో 6గురు మృతి చెందారు.**
5. **అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది.**

==========================

స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ పండుగలను జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన మన్ కి బాత్, మనసులోని మాట కార్యక్రమం 125వ సంచికలో పలు అంశాలపై నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, పండుగల సమయంలో స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని సూచించారు. బహుమతులు, దుస్తులు, అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేటప్పుడు స్వదేశీయంగా తయారైన వాటికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధానమంత్రి సూచిస్తూ…

వాయిస్ 28 సెకన్లు

అలాగే హైదరాబాద్ విమోచన దినోత్సవం సెప్టెంబరులో జరుపుకుంటున్న నేపథ్యంలో 'ఆపరేషన్ పోలో'లో పాల్గొన్న వీరులందరి సాహసాన్ని గుర్తు చేసుకోవాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కాగా మన్ కీ బాత్ 125వ సంచిక పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందిం,చిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. కేరళలోని అలప్పుళలో జరిగిన ఎంపీ మెరిట్ అవార్డ్-2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే 11 వేల 55 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్..32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నెలంతా రేషన్ సరకులు పంపిణీ చేసేలా చూస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి నిన్న పాల్గొన్నారు. రేషన్ దుకాణాల్లో రాగులు, నూనె, గోధుమ పిండి అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

దేశంలో సామాజిక భద్రతా పింఛన్ కోసం అత్యధిక మొత్తాన్ని కేటాయిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ భరోసాపింఛన్ పథకం కింద లబ్ధిదారులకు పింఛన్ నగదును పంపిణీ చేసేందుకు 2 వేల 746.52 కోట్ల రూపాయలను విడుదల చేశామని కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే అందించడంతోపాటు వారి జియో-కోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం మండలం తూర్పుతాళ్లలో గత రాత్రి జరిగిన గణేష్ శోభాయాత్రలో ట్రాక్టర్ అదుపుతప్పడంతో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు గాయపడ్డారు. జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఎస్.పి. పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 18 సెకన్లు

అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు చింతలవీధి జంక్షన్ లో వినాయక నిమజ్జన కార్యక్రమంలో జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు మృతి చెందారు.

మరోవైపు రాష్ట్రంలో పలుచోట్ల గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాల్లో జరిగిన ప్రమాదాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు.

---------------------------

తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా నిన్న జరిగిన సమావేశంలో నాలుగు బిల్లులను శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్స్ బిల్లు, ఇంద్రేశం, జిన్నారం పురపాలక సంఘాల ఏర్పాటుకు ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా అసెంబ్లీ ఆమోదించింది. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, కాళేశ్వరం కమిషన్ నివేదికపై తొమ్మిదిన్నర గంటలపాటు చర్చ జరిగింది. అనంతరం శాసన సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

---------------------------

దేశంలో విద్యా సంస్థలను పర్యవేక్షించే అత్యున్నత విద్యా సంస్థ అయిన జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ–ఎన్.సి.ఈ.ఆర్.టి. ఆవిర్భావ దినోత్సవం ఈ రోజు. 1961 సెప్టెంబర్ ఒకటవ తేదీన ఎన్.సి.ఈ.ఆర్.టి. దేశంలో తన విద్యా సంబంధమైన కార్యకలాపాలను ప్రారంభించింది. కేంద్ర మానవ వనరుల శాఖకు ఎన్.సి.ఈ.ఆర్.టి. కీలకంగా వ్యవహరిస్తుంది. విద్యా రంగంలో గుణాత్మకమైన మార్పులు చేపట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్.సి.ఈ.ఆర్.టి. తగిన మార్గదర్శకాలను సూచిస్తుంది.

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లోని జలాశయాలకు వరద నీరు చేరుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ఉధృతి పెరగడంతో శ్రీశైలం జలాశయానికి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు 10 గేట్లను 10 అడుగుల మేర పైకి ఎత్తి దిగువనున్న నాగార్జున సాగర్‌కు 3 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు.. కాగా ప్రస్తుతం 882.60 అడుగులకు చేరింది.

---------------------------

బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరుగుతున్న ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. నిన్న జరిగిన పూల్–ఎ మ్యాచ్ లో భారత హాకీ జట్టు 3–2తో జపాన్ జట్టును ఓడించింది. హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ సాధించగా మన్‌దీప్‌సింగ్ ఒక గోల్ చేశారు. కాగా ఈరోజు జరిగే చివరి పూల్–ఎ మ్యాచ్‌లో కజకిస్తాన్‌తో భారత్ పోటీపడనుంది

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో రేపు అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాగల మూడు రోజులపాటు అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ

వాయిస్ ..28 సెకన్లు

కాగా.. ఎన్టీఆర్ జిల్లాలో ఈ తెల్లవారుజామునుండి భారీ వర్షం కురుస్తోంది.

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజులు పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================